నేడు గోదాదేవి కల్యాణం

మన్సూరాబాద్: డివిజన్ పరిధి విజయశ్రీకాలనీలోని పద్మావతి గోదా సమేత శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో సోమవారం రాత్రి 7 గంటలకు శ్రీగోదా రంగనాయకుల స్వామి కల్యాణ మహోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ చీర్క నర్సిరెడ్డి తెలిపారు.

ఆదిత్యానగర్‌కాలనీలో..

ఆదిత్యానగర్‌కాలనీలోని శ్రీలక్ష్మిపద్మావతి వేంకటేశ్వరస్వామి దేవాలయంలో ఉదయం 11 గంటలకు గోదాదేవి కల్యాణ మహోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ మోహన్‌రెడ్డి తెలిపారు.

నియామకం



సుమన్‌గౌడ్

చైతన్యపురి: బీజేపీ రంగారెడ్డి జిల్లా కౌన్సిల్ సభ్యుడిగా చైతన్యపురికి చెందిన బత్తుల సుమన్‌గౌడ్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీ బలోపేతానికి తనవంతు కృషి చేస్తానని, తనపై నమ్మకంతో పదవి ఇచ్చిన జిల్లా అధ్యక్షుడు సామరంగారెడ్డి, చైతన్యపురి కార్పొరేటర్ రంగా నర్సింహగుప్తా, జిల్లా ఉపాధ్యక్షుడు రుద్రారపు శంకర్, డివిజన్ మాజీ అధ్యక్షుడు వినోద్ యాదవ్‌కు కృతజ్ఞతలు అన్నారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత



పరిశుభ్రత కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే బలాల

చాదర్‌ఘాట్: పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని మలక్‌పేట ఎమ్మెల్యే బలాల సూచించారు. ఆదివారం అసేజ్ వా వరల్డ్ మిషన్ సొసైటీ ఆఫ్ చర్చ్ గాడ్ యంగ్ అడల్ట్ వర్కర్ వలంటీర్ గ్రూప్ ఆధ్వర్యంలో ఓల్డ్‌మలక్‌పేట డివిజన్ వాహెద్‌నగర్‌లో నిర్వహించిన పరిశుభ్రత కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులతో కలిసి ఎమ్మెల్యే పాల్గొన్నారు. సంస్థ ప్రతినిధులు రోడ్డుపై పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించారు. నగరాన్ని స్వచ్ఛగా తీర్చిదిద్దడానికి తమ వంతు కృషి చేస్తామని సంస్థ ప్రతినిధులు తెలిపారు.

ఓపెన్ జిమ్ ప్రారంభం



ఓపెన్ జిమ్ ప్రారంభిస్తున్న నర్సింహారెడ్డి

మన్సూరాబాద్: మన్సూరాబాద్ పెద్ద చెరువు ప్రాంగణంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌ను కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పెద్దచెరువు ప్రాంగణంలో వాకర్స్ పెరుగుతున్న దృష్ట్యా త్వరలో మరొక ఓపెన్ జిమ్ ఏర్పాటు చేస్తానన్నారు. వాకింగ్ ట్రాక్, యోగాషెడ్‌ను అందుబాటులోకి తీసుకు వచ్చామని పేర్కొన్నారు. ఓపెన్ జిమ్‌ను సద్వినియోగం చేసుకుని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వేమన్‌రెడ్డి, నాంపల్లి రామేశ్వర్, భూపాల్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ నేతల ముందస్తు అరెస్టు

హస్తినాపురం: యాదాద్రి భువనగిరి జిల్లా బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంపై యూత్ కాంగ్రెస్ నేతలు చేసిన దాడికి నిరసనగా ఆదివారం భువనగిరి బంద్‌కు పిలుపునివ్వడంతో ఆ ప్రాంతానికి తరలి వెళ్తున్న బీఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డిని అరెస్ట్ చేసి వనస్థలిపురం పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. పైళ్ల శేఖర్‌రెడ్డి, భువనగిరి ఎంపీగా పోటీ చేసిన క్యామ మల్లేశ్‌తో పాటు 50 మంది బీఆర్‌ఎస్ నాయకులను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం వారి సొంతపూచికత్తుపై విడుదల చేసినట్లు పోలీసులు తెలిపారు.

రాములోరి ధనుస్సు - విల్లుకు ప్రత్యేక పూజలు

మీర్‌పేట: భక్తుల సందర్శనార్థం అయోధ్య రాములోరి కోసం నగరానికి చెందిన భక్తుడు చల్లా శ్రీనివాసశర్మ చేయించిన వెండి ధనుస్సు-విల్లు శుక్రవారం రాత్రి మీర్‌పేట శివసాయినగర్‌లోని గౌరీ నీలకంఠేశ్వరస్వామి దేవాలయానికి చేరుకుంది. ఈ సందర్భంగా ఆలయ అర్చకుడు ధనుస్సు-విల్లుకు ప్రత్యేక పూజలు చేయగా, స్థానికంగా ఉన్న భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నట్లు ఆలయ చైర్మన్ తీగల సుభాష్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు సంతోష్‌రెడ్డి, వెంకట కృష్ణారావు, వెంకటరమణ, బాపిరాజు ఉన్నారు.



ప్రయాణికుల రద్దీతో కిటకిటలాడుతున్న ఎల్‌బీనగర్ రింగ్‌రోడ్డు

పండక్కి పోదాం చలో చలో

సంక్రాంతికి సొంతూళ్లకు బయలుదేరిన నగరవాసులు

సంక్రాంతి సెలవులు రావటంతో నగరవాసులు సొంతూళ్ల బాటపట్టారు. పల్లెబాట పట్టిన పట్నంవాసులతో ఎల్‌బీనగర్ రింగ్ రోడ్డు కిక్కిరిసిపోయింది. సంక్రాంతి సందర్భంగా పాఠశాలలు, కాలేజీలకు సెలవులు రావడంతో ఏ రోడ్డు చూసినా బ్యాగులు, సామగ్రితో తరలివెళ్తున్న దృశ్యాలు కనిపిస్తున్నాయి. ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా తెలంగాణ ఆర్టీసీ అదనంగా ప్రత్యేక బస్సులను నడుపుతుంది. అయినా బస్సులు సరిపోకపోవడంతో ఎల్‌బీనగర్ రింగ్‌రోడ్డులో ప్రయాణికులు రోడ్డుపైనే పడిగాపులు పడాల్సిన దుస్థితి కలిపించింది. -మన్సూరాబాద్



బస్సు ఎక్కేందుకు పరుగులు తీస్తున్న ప్రయాణికులు

- ప్రయాణికులు ఇబ్బందులు కలుగకుండా చర్యలు
- రద్దీకి అనుగుణంగా అదనపు బస్సులు
- అక్కడక్కడ 'ప్రైవేటు' దోపిడీ

ప్రత్యేక కౌంటర్లు, హెల్ప్‌లైన్ సేవలు..

ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకుని తెలంగాణ ఆర్టీసీ అధికారులు ప్రత్యేక బస్సులను నడుపుతున్నారు. ప్రయాణికుల సౌకర్యార్థం ఎల్‌బీనగర్ రింగ్‌రోడ్డులో ప్రత్యేకంగా కౌంటర్లు ఏర్పాటు చేసి హెల్ప్‌లైన్ సేవలు అందిస్తున్నారు. ఎల్‌బీనగర్ రింగ్‌రోడ్డు ప్రాంతంలో ప్రత్యేకంగా టెంట్లు వేసి ప్రయాణికులు కూర్చునేందుకు కుర్చీలు వేశారు. తాగునీటి వసతి, బయో టాయిలెట్లను ఏర్పాటు చేశారు. ప్రయాణికులకు ఇబ్బందులు కలగకుండా ప్రత్యేకంగా ఒక ఉన్నతాధికారిని నియమించి ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

ఆగని 'ప్రైవేటు' దోపిడీ

పల్లెబాట పట్టిన పట్నంవాసులు నగర శివారు ప్రాంతమైన ఎల్‌బీనగర్ రింగ్‌రోడ్డుకు భారీగా చేరుకుంటున్నారు. అంతేస్థాయిలో ఆర్టీసీ బస్సులు నడుపుతున్నా.. ప్రైవేటు దోపిడీని అరికట్టలేకపోతున్నారు. ప్రయాణికుల నుంచి సాధారణ ఛార్జీల కన్నా ఐదింతలు ఎక్కువ మొత్తంలో వసూల్ చేస్తున్నారు. ప్రైవేటు ఆపరేటర్లు కొంత మంది దళారులను ఏర్పాటు చేసుకుని ప్రయాణికుల నుంచి ఎక్కువ మొత్తంలో దండుకుంటున్నారు. రవాణా, పోలీస్ శాఖ అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తుండటంతో 'ప్రైవేటు' దోపిడీ యథేచ్ఛగా సాగుతోందని ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



ప్రయాణికుల సౌకర్యార్థం టెంట్లు వేసిన దృశ్యం

సైక్లింగ్ ట్రాక్‌తో రోడ్డు ఇరుకు..



జాతీయ రహదారిపై సైక్లింగ్ ట్రాక్ పేరిట చేపట్టిన నిర్మాణాలతో రోడ్డు ఇరుకుగా మారి బస్సులు రోడ్డుపైనే నిలుస్తుండటంతో ట్రాఫిక్ జామ్ ఏర్పడుతుంది. వాహనాల రద్దీతో బస్సుల కోసం ప్రయాణికులు రోడ్డుపైనే వేచి ఉండాల్సిన దుస్థితి ఏర్పడింది. ఎల్‌బీనగర్ కూడలి వద్ద బస్ షెల్టర్లు ఏర్పాటు చేసి, ప్రయాణికులకు వసతి కల్పించాలని పలుమార్లు కోరిన ప్రభుత్వం స్పందన లేదు.

– కొప్పుల నర్సింహారెడ్డి, మన్సూరాబాద్ కార్పొరేటర్

ఛార్జీల భారం



ప్రత్యేకంగా వేసిన అదనపు బస్సులు ఎక్కువగా విజయవాడకు వెళ్తుండటంతో సూర్యాపేట, కోదాడ తదితర ప్రాంతాల వాసులకు స్టాపు లేకుండా పోయింది. హైదరాబాద్ నుంచి విజయవాడకు టికెట్ తీసుకోవాలని ఆర్టీసీ అధికారులు పేర్కొంటున్నారు. దీంతో సూర్యాపేట, కోదాడ వెళ్లే ప్రయాణికులు విజయవాడ వరకు టికెట్ తీసుకోవాల్సి వస్తోంది. సూర్యాపేట, కోదాడ ప్రయాణికులు టికెట్ల భారం పడుతుంది. ఆర్టీసీ ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని సవరణ చేయాలి.

– రహీం, ప్రయాణికుడు సూర్యాపేట

పోలీసుల సూచనలు పాటించాలి



చాదర్‌ఘాట్: సంక్రాంతికి ఊర్లేళ్లే వారు అప్రమత్తంగా ఉండాలని చాదర్‌ఘాట్ ఇన్‌స్పెక్టర్ రాజు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..

- సోషల్ మీడియాలో మీ లొకేషన్, మీరు వెళ్లే ప్రాంతాల వివరాలు పెట్టరాదన్నారు.
- ఇంట్లో సీసీ కెమెరాలు అమర్చుకోవాలని, ఎవరైనా అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.
- బంగారు ఆభరణాలు, డబ్బులు బ్యాంకు లాకర్లలో భద్రపర్చుకోవాలని, వెళ్లేటప్పుడు స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.

పోలీస్ స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలి



హస్తినాపురం: సంక్రాంతి పండుగ సొంతూళ్లకు వెళ్లేవారు స్థానిక పోలీస్ స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని వనస్థలిపురం ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..

- ఊరికి వెళ్లే వారు బంగారు, వెండి ఆభరణాలు, విలువైన వస్తువులు, నగదును ఇంట్లో పెట్టకుండా వాటిని తమతో పాటు తీసుకెళ్లాలన్నారు.
- ప్రధాన ఇంటి ద్వారానికి బయటి నుంచి గడియ పెట్టి వెనుక ద్వారానికి తాళం వేసి ఇంట్లో లైట్లు వేసి ఉంచాలి. ఊరికి వెళ్లిన తర్వాత ఇంటి పక్కన వారికి ఫోన్‌చేసి వివరాలు తెలుసుకుంటూ ఉండాలన్నారు.
- కాలనీల్లో అనుమానాస్పదంగా ఎవరైన సంచరిస్తుంటే వెంటనే డయల్100కు ఫోన్ చేయాలన్నారు.

పరామర్శ



నందురాజ్‌ను పరామర్శిస్తున్న వీరేంద్రబాబు యాదవ్

సైదాబాద్: బీజేపీ నాయకులు, కార్యకర్తలకు పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుందని బీజేపీ భాగ్యనగర్ జిల్లా అధికార ప్రతినిధి ఎన్.వీరేంద్రబాబు యాదవ్ అన్నారు. ఇటీవల పార్టీ కార్యాలయంపై కాంగ్రెస్ నాయకుల దాడి ఘటనలో బహదూర్‌పురా నియోజకవర్గానికి చెందిన ఎస్సీ మోర్చా ఆఫీస్ ఇన్‌చార్జ్ నందురాజ్ గాయపడ్డారు. ఆసుపత్రిలో చికిత్స పొంది ఇంట్లోనే విశ్రాంతి తీసుకుంటున్నాడు. ఆదివారం వీరేంద్రబాబు యాదవ్ పార్టీ నాయకులతో కలిసి ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీ కార్యాలయంపై దాడి ఘటనను అగ్రనాయకత్వం తీవ్రంగా పరిగణిస్తుందని, గాయాలపాలైన కార్యకర్తలను పార్టీ ఆదుకుంటుందన్నారు.

చీరల పంపిణీ



చీరలు పంపిణీ చేస్తున్న దయానంద్‌గుప్తా, ఉప్పల శ్రీనివాస్‌గుప్తా

నాగోలు: వాసవీ క్లబ్ హైదరాబాద్ ఎన్నో సేవా కార్యక్రమాలు చేపడుతున్నారని ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్‌గుప్తా, టీపీసీసీ ప్రచార కమిటీ కోకన్వీనర్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా అన్నారు. నాగోలు పరిధిలోని బండ్లగూడ సమీపంలో పాపయ్యగూడ చౌరస్తాలో వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానికులకు చీరల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న దయానంద్‌గుప్తా, ఉప్పల శ్రీనివాస్ మాట్లాడుతూ.. వాసవీక్లబ్ హైదరాబాద్ ఆధ్వర్యంలో అనేక సంవత్సరాల నుంచి రక్తదాన శిబిరాలు, మెగా హెల్త్ క్యాంపులు, పుస్తకాల పంపిణీ తదితర కార్యక్రమాలు చేపడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో రాజేశ్వర్ రావు, అందోజు రవీంద్రాచారి, యాదిరెడ్డి, దయాకర్, శ్రీనివాస్ ప్రభ, ప్రదీప్ కుమార్ పాల్గొన్నారు.

అష్టలక్ష్మి దేవాలయంలో పూజలు

దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కేపురం డివిజన్ అష్టలక్ష్మి దేవాలయంలో ధనుర్మాసం పురస్కరించుకుని ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అష్టలక్ష్మి సమేత శ్రీమన్నారాయణ స్వామికి ప్రత్యేక పూజలు, గోధ అమ్మవారికి అభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవాలయ చైర్మన్ సోమా సురేష్ కుమార్, ప్రధాన కార్యదర్శి గంప జగన్, మాజీ చైర్మన్ బంధం దామోదర్ గుప్తా, మేడం సుధాకర్‌గుప్తా, వైస్ చైర్మన్ నాగమల్లు శ్రవణ్‌కుమార్ పాల్గొన్నారు.



పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్, వనస్థలిపురం రైతు బజార్‌లలో కూరగాయల ధరలు.. టమాటా రూ. 11, వంకాయ 23, బెండ 40, పచ్చిమిర్చి 40, కాకర 38, బీర 45, క్యాలీఫ్లవర్ 18, క్యాబేజీ 13, క్యారెట్ 37. దొండ 48, ఆలు 25, ఉల్లి 32, గోకర 34, దోస 18, సొర 13, పొట్ల 18, అరటి 09, చిక్కుడు 45, అర్వి 37, మునగ 85, చిలగడదుంప 65, బీట్‌రూట్ 35, కీర 35, ఫ్రెంచ్ బీన్స్ 45, కాప్సికమ్ 65. ఈ ధరలు సోమవారం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

కనుల పండువగా కల్యాణోత్సవం



కల్యాణ వేడుకల్లో పాల్గొన్న కోట్ల శ్రీనివాస్

సైదాబాద్: సైదాబాద్ డివిజన్ కరణ్‌బాగ్‌లో పుట్టమన్నుతో స్వయంభువుగా వెలిసిన శ్రీమల్లికార్జున స్వామి కల్యాణం దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. మల్లన్న స్వామి జాతర మహోత్సవాలు పురస్కరించుకొని ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. విద్యుత్‌దీపాలు, పూలతోరణాలతో అలంకరించారు. ఆదివారం తెల్లవారుజామున స్వామి వారికి మేలుకొలుపు అనంతరం అభిషేకాలు, ప్రత్యేక అలంకరణ చేశారు. మధ్యాహ్నం శ్రీబలిజ మేడలా దేవి, శ్రీగొల్ల కేతమ్మ సమేత శ్రీమల్లన్నస్వామి కల్యాణ మహోత్సవాన్ని శాస్త్రోక్తంగా జరిపించారు. ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన వేడుకలకు భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. భక్తులకు అసౌకర్యం కలుగకుండా దేవస్థానం సిబ్బంది అన్ని ఏర్పాట్లు చేశారు. సైదాబాద్ డివిజన్ కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి, హైదరాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ కోట్ల శ్రీనివాస్, ఆలయ కార్య నిర్వాహణ అధికారి వి.ఎస్.వి. సత్యానారాయణ, ఆలయ మాజీ ధర్మకర్తలు మడిగెల లక్ష్మారెడ్డి, కొషిక కృష్ణ పాల్గొన్నారు.

వివేకానందుడి మాట.. స్ఫూర్తిబాట



వివేకానంద విగ్రహానికి నివాళి అర్పిస్తున్న సామ రంగారెడ్డి, పవన్‌కుమార్



వేడుకల్లో పాల్గొన్న సామ రంగారెడ్డి, చింతల అరుణ, పంగా శ్రీకాంత్..

నాగోలు: భారత ఆధ్యాత్మిక విశిష్టతను విశ్వవేదికపై చాటి చెప్పిన గొప్ప మహనీయుడు స్వామి వివేకానంద అని పలువురు పేర్కొన్నారు. ఎల్‌బీనగర్, మలక్‌పేట నియోజకవర్గాల్లోని వివేకానంద విగ్రహాలు, చిత్రపటాలకు ప్రజాప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. స్వామి వివేకానందను నేటి యువత స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. నాగోలు డివిజన్‌లో బీజేపీ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన వివేకానంద జయంతి వేడుకలో బీజేపీ జిల్లా అర్బన్ అధ్యక్షులు సామ రంగారెడ్డి, నాగోలు కార్పొరేటర్ చింతల అరుణ, డివిజన్ అధ్యక్షులు పంగా శ్రీకాంత్ పాల్గొన్ని స్వామి వివేకానంద చిత్రపటానికి నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమంలో సంజీవరెడ్డి, పంగా శ్యామ్‌కుమార్, సిద్దల ఐలయ్య, వస్పరి మల్లేష్, పద్మరెడ్డి, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌బీనగర్‌లో..

మన్సూరాబాద్: స్వామి వివేకానంద జయంతి వేడుకలు ఎల్‌బీనగర్‌లోని పలు ప్రాంతాల్లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. మన్సూరాబాద్ డివిజన్ సహారాస్టేట్స్‌కాలనీ ప్రధాన గేటు వద్ద ఉన్న స్వామి వివేకానంద విగ్రహం వద్ద కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రిటైర్డ్ రిజిస్ట్రార్, ఆధ్యాత్మికవేత్త విష్ణువర్ధన్‌రాజు, రిటైర్డ్ సైంటిస్ట్, యోగా గురువు భరత్‌భూషణ్, ప్రధాన వక్తలుగా రాష్ట్ర ప్రథమ గురుకుల విద్యాలయం, సర్వేలు పూర్వ విద్యార్థులు ఎ.మల్లికార్జునరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి హాజరై ప్రసంగించారు. జడ్జెస్‌కాలనీలోని వివేకానంద విగ్రహానికి మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్‌రెడ్డి నివాళి అర్పించారు. బీఎన్‌రెడ్డినగర్‌లో వివేకానంద విగ్రహానికి కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి పూలమాల వేసి నివాళి అర్పించారు.

యువతకు స్ఫూర్తి ప్రదాత..

సైదాబాద్: దేశ ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటిన స్వామి వివేకానంద యువతకు స్ఫూర్తి ప్రదాతగా నిలిచారని ఐఎస్‌సదన్ డివిజన్ కార్పొరేటర్ జంగం శ్వేతామధుకర్‌రెడ్డి అన్నారు. ఆదివారం స్వామి వివేకానంద జయంతి పురస్కరించుకొని ఐఎస్‌సదన్ డివిజన్ ప్రెస్ కాలనీలోని వివేకానందుడి విగ్రహానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గిరిధర్, శంకరాచారి, దేవేందర్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, విజయ్‌కుమార్, నరసింహారెడ్డి, బాలకృష్ణ పాల్గొన్నారు.



చంపాపేట చౌరస్తాలో వివేకానంద విగ్రహానికి నివాళి అర్పిస్తున్న బీఆర్‌ఎస్ నేత కృష్ణమాచారి



ప్రెస్‌కాలనీలో వివేకానంద విగ్రహానికి నివాళి అర్పించిన కార్పొరేటర్ శ్వేతామధుకర్‌రెడ్డి



మన్సూరాబాద్ సహారాస్టేట్స్‌కాలనీ వద్ద..



జడ్జెస్‌కాలనీలో..



బీఎన్‌రెడ్డినగర్‌లో వివేకానందకు నివాళి అర్పిస్తున్న కార్పొటర్ మొద్దు లచ్చిరెడ్డి

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం

దిల్‌సుఖ్‌నగర్: రాష్ట్రంలో చేనేత కార్మికులకు నేతన్న పొదుపు, భరోసా, భద్రతా పథకాలు, త్రిఫ్ట్ ఫండ్ కోసం రూ.163 కోట్లు నిధులు విడుదల చేసి సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, చేనేత జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు చిత్రపటాలకు పద్మశాలి సంఘం ఎల్‌బీనగర్ సర్కిల్ అధ్యక్షులు, ఆర్‌కేపురం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పున్న గణేష్ నేత ఆధ్వర్యంలో ఆదివారం ఆర్‌కేపురంలో పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా పున్న గణేష్ నేత మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత అన్నం పెట్టే రైతన్న, నేతన్నలకు రుణమాఫీ ప్రకటించిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కిందన్నారు. చేనేతకు ప్రత్యేక ముద్ర సిల్క్ వస్త్రాలకు సిల్క్ మార్క్, చేనేత వస్త్రాలకు హ్యాండ్లూమ్ మార్పును ప్రత్యేకంగా ముద్రణ రూపొందించిన తొలి రాష్ట్రం తెలంగాణ ప్రభుత్వం అన్నారు. ఈ కార్యక్రమంలో రవికుమార్, తలాటి రమేష్ నేత, జెల్ల జగన్నాథం, భోగ జగదీష్, సంఘం రమేష్, నర్సింగ్, కళ్యాణ్, ప్రవీణ్ కుమార్, శివ పాల్గొన్నారు.



సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నాయకులు

ఉపాధ్యాయుల సంక్షేమానికి భరోసా కల్పిస్తా

మన్సూరాబాద్: ఉపాధ్యాయుల సంక్షేమానికి భరోసా కల్పిస్తానని వరంగల్, ఖమ్మం, నల్లగొండ టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థి పింగిలి శ్రీపాల్‌రెడ్డి అన్నారు. ప్రోగ్రెసీవ్ రికగ్నైజ్‌డ్ గురుకుల టీచర్స్ అసోసియేషన్ (పీఆర్‌జీటీఏ) రాష్ట్ర కమిటీ సమావేశంతో పాటు రాష్ట్ర మెయిన్ కమిటీ, మైనార్టీ, బీసీ, సాధారణ గురుకులాల రాష్ట్ర కమిటీల ప్రమాణస్వీకారోత్సవ కార్యక్రమం మన్సూరాబాద్ మల్లికార్జుననగర్ కాలనీలోని కమ్యూనిటీహాల్లో ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన శ్రీపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు న్యాయమైన వేతనాలు, ప్రయోజనాలకు పోరాటం చేస్తానన్నారు. ప్రభుత్వ సంస్థలోని ఉపాధ్యాయుల ప్రయోజనాలకు ప్రయత్నిస్తానని పేర్కొన్నారు.



మాట్లాడుతున్న పింగిలి శ్రీపాల్‌రెడ్డి

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9666021515
9912220363
9912220365